# విలువలు

సాయంత్రం ఆరుగంటల సమయం. బృందావన్ కాలనీ ప్రశాంతంగా ఉంది. ఓ మధ్యతరగతి కుటుంబం నివసిస్తున్న ఆ ఇల్లు కూడా ప్రశాంతంగా ఉంది.

వంటింట్లో వంటపని చేసుకుంటున్న అరుణకు బయటెవరో తలుపుకొడ్తున్న చప్పుడు వినిపించింది. ఈవేళప్పుడు ఎవరై ఉంటారా అని కొంచెం ఆశ్చర్యపడ్తూ వెళ్ళి వాళ్లింటి ముఖద్వారం తలుపులు తెరిచింది. అప్పుడు బయట ఓ మధ్యవయస్కుడు నిల్చొని ఉన్నాడు. చూడటానికి చాలా మర్యాదస్తుడులా కనిపించాడు.

"ఎవరండీ మీరు?" అంది అరుణ.

"నాపేరు దయాకర్... నేను మీ అబ్బాయి ప్రదీప్ చదువుకుంటున్న హై స్కూల్లో టీచర్ని" అన్నాడతడు.

"అయ్యో... మీరు మా అబ్బాయికి టీచరా? సారీ... మిమ్మల్ని నేను గుర్తుపట్టలేదు.. లోపలకు రండి" అందామె బోల్డు బాధపడిపోతూ, దయాకర్‌ను ఇంట్లోకి ఆహ్వానిస్తూ..

"కూర్చొండి సార్!" అందామె అతనికి వాళ్ళింటి డ్రాయింగ్‌రూమ్‌లో ఉన్న కుర్చీని చూపిస్తూ

"మీ అబ్బాయి ప్రదీప్ ఇంట్లో ఉన్నాడండీ?" అన్నాడు దయాకర్.

"ఉన్నాడండీ! వాడికోసం వచ్చారా?"

"ఔను... మీ వాడితో నాకు కొంచెం పనుందండీ?"

"మా అబ్బాయికోసం మీరు రావడమేమిటండి. మీరు రమ్మని కబురుచేస్తే వాడే వచ్చేవాడుగా..."

"ఆరోజులు పోయాయిలెండి – పూర్వపు రోజుల్లో గురువు చెప్పినట్టు శిష్యులు వినేవారు. ఇప్పుడు శిష్యులు చెప్పినట్టు గురువు వినాలి. అలాగే ఇదివరకు గురువును వెతుక్కుంటూ శిష్యులు వస్తూండేవాళ్ళు. ఇప్పుడు శిష్యుల్ని వెతుక్కుంటూ గురువే రావాలి. కాలమహిమ. యేం చేస్తాంలెండి? మీ వాన్ని కాస్త పిలుస్తారా?"

"వాడు లోపల టీ.వి. చూస్తున్నాడు. క్రికెట్ మ్యాచేదో వస్తున్నట్టుంది. పిలుస్తానుండండి" అంటూ అరుణ లోపలికెళ్ళబోయింది.

"టీ.వీ.లో క్రికెట్ మ్యాచ్ చూస్తూ పరవశంతో గంతులు వేస్తున్నవాడు మీరు పిలిస్తే వస్తాడో రాడో. ఈనాటి యువకులు టీ.వి. ఛానళ్ళకు బానిసలయి పోయారు లెండి. నేనే వెళ్ళి పిలుస్తానుండండి..." అంటూ దయాకర్ లేచి నిల్చున్నాడు.

"మీరెందుకెళ్తారండీ... మావాడు అలాంటివాడు కాదులెండి. మీసారొచ్చారని చెబితే వాడు మీ దగ్గరకు పరిగెత్తుకొని వస్తాడు" అంది అరుణ.

"ప్రతి తల్లీ తన కొడుకు చాలా బుద్ధిమంతుడే అనుకుంటుంది. మీ మాటెందుకు కాదనాలి... వెళ్ళి పిలవండి - వస్తాడో రాడో చూద్దాం" అన్నాడు దయాకర్.

"మీరీ పేపర్ చదువుతూ కూర్చోండి... నేను వాడిని ఇప్పుడే పిల్చుకొస్తాను" అంటూ టీపాయ్‌మీదున్న పేపర్ని దయాకర్ చేతికిచ్చి అరుణ లోపలికెళ్ళింది.

ప్రదీప్‌కు ఆ ఇంట్లో ఓ ప్రత్యేక గదుంది. దాంట్లో అతనికోసమే ఒక టీ.వీ. ఒక కంప్యూటర్, ఒక డి.వీ.డి. ప్లేయర్ మొదలైనవన్నీ ఉన్నాయి... టీ.వీ.లో క్రికెట్ మ్యాచ్ టెలికాస్ట్ అవుతున్నప్పుడు అతడు ఒక్క బాల్‌ను కూడా మిస్ కావడానికిష్టపడడు.. ఎవరొచ్చి డిస్టర్బ్ చేసినా వాళ్ళ మీద నోరు పారేసుకుంటాడు. చివరకు వాళ్ళమ్మయినా సరె ఊరుకోడు. వాళ్ళ నాన్నేమొ ఎప్పుడూ ఇంట్లో ఉండనే ఉండడు. "ప్రదీప్... ప్రదీప్... తలుపు తీయరా" అంటున్న వాళ్ళమ్మ మాటలు అతనికి వెంటనే వినిపించలేదు. , పెద్ద సౌండ్‌తో టెలికాస్ట్ అవుతున్న క్రికెట్ మీదనే దృష్టినంతా కేంద్రీకరించటంతో అతనికి యే పిలుపు వినిపించలేదు.

ఆమె దబీదబీమని తులుపుల మీద బాదటంతో అతడు విసురుగా లేచి "ఎవరు... ఎవరు... నేను క్రికెట్ చూస్తున్నప్పుడు నన్ను డిస్టర్బ్ చెయ్యొద్దని ఎన్నిసార్లు చెప్పాను. అయినా వీళ్ళకు బుద్దిలేదు... బుద్దిరాదు" అంటూ అతడు తలుపు తెరిచాడు.

"నీకేమైనా బుద్ధుందా... ఎందుకు నన్ను డిస్టర్బ్ చేశావు? ఇప్పుడేం కొంపలంటుకు పోతున్నాయని తలుపుల మీద బాదుతున్నావు?" అన్నాడతడు చాలా కోపంగా.

"ఎందుకలా అరుస్తున్నావు రా! మీ టీచరొచ్చాడ్రా... నీతో మాట్లాడాలట.. రా.."

"టీచరా? ఎవరాయన? ఆయనకిప్పుడే తీరిందా?" అన్నాడు ప్రదీప్ చాలా అసహనంగా

"ఆయనపేరు దయాకర్ అట్రా... నీతో యేదో అర్జెంట్‌గా మాట్లాడాలట.."

"నాకూ చాలా అర్జెంట్‌పనే ఉంది... మా దయాకర్ సారొచ్చాడా? ఆయనెందుకొచ్చాడో నాకు తెలుసు... మ్యాచ్ చాలా ఉత్కంఠభరితంగా సాగుతోంది... ఇంకో ఐదారు ఓవర్లయితే లంచ్ బ్రేక్ వస్తుంది... అప్పుడొస్తానని చెప్పు" అంటూనే ప్రదీప్ ధామ్మని తులుపులు మూసెసి టీ.వీ. ముందు కెళ్ళిపోయాడు.

వీడికి టీచరంటే గౌరవంలేదు తల్లిదండ్రులంటే గౌరవం లేదు. ఫ్రెండ్స్, టీవీలు, కంప్యూటర్లు, క్రికెట్‌మ్యాచెస్ తప్ప వీడికి మరో ప్రపంచమేలేదు... ఇంటిదాకా వచ్చిన ఈ టీచర్‌గార్కి యేమని చెప్పను? అనుకుంటూ బిక్కమొహం పెట్టుకొని అరుణ వాళ్ళ డ్రాయింగ్ రూంలో ప్రవేశించింది.

"యేమండీ అరుణగారూ! మీ సుపుత్రుడు రానన్నాడా?" అన్నాడు దయాకర్.

"రానని అన్లేదనుకొండి..." అరుణ నీళ్ళునమిలింది.

"మరి యేమన్నాడు?"

"క్రికెట్ మ్యాఛ్ అయిపోయాక తనేవచ్చి మిమ్మల్ని కలుస్తానన్నాడు"

"క్రికెట్ మ్యాఛ్ అయిపోయాక కలుస్తానన్నాడా? టీచరంటే ఎంత గౌరవం.. ఎంత గౌరవం.. క్రికెట్ మ్యాఛ్ ఎప్పుడయిపోతుందో..."

"కాస్సేపట్లో లంఛ్ బ్రేక్ ఉంటుందటండి అప్పుడొచ్చి కలుస్తానన్నాడు".

"ఇది డేనైట్ మ్యాఛ్ అనుకుంటాను. లంఛ్ బ్రేక్‌కు ఇంకో గంటయినా పట్టుంది... మీవాడితో నాకు అర్జెంట్ పనుందే..."

"ఆ అర్జెంట్ పనేదో నాకు చెప్పండి. నేను వాడితో చెప్పి మీదగ్గరకు తీసుకొస్తాను"

"మీవాడేంచేశాడో తెలుసా అరుణగారూ!"

"యేం చేశాడండీ?" అరుణ గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి.

"మా అమ్మాయికి ప్రేమలేఖరాశాడు."

"ప్రేమలేఖ రాశాడా?"

"రాశాడు - మా అమ్మాయి తొమ్మిదో తరగతి చదువుతోంది. మీవాడు పదోతరగతి చదువుతున్నాడు. వీడు మా అమ్మాయిని గాఢంగా ప్రేమించేశాట్ట... మా అమ్మాయి కూడా వాడిని అంతే గాఢంగా ప్రేమించకపోతే విషం తాగి చస్తాడట... మన పెళ్ళికి మీ అమ్మనాన్నలు, మా అమ్మనాన్నలు అంగీకరించకపోతే ఎక్కడికైనా లేచిపోవడానికి రెడీగా ఉండు అంటూ రాశాడు. చూడండి... మీరే చూడండి. వచ్చీరాని భాషల్లో, వందతప్పులతో ఈ ప్రేమలేఖలో ఎలాంటి బూతు కవిత్వం ఒలకబోశాడో చూడండి. ఒక్క వాక్యమైనా సరిగ్గా రాయలేని వెధవకి అప్పుడే ప్రేమ, లేచిపోవడాలు.. చూడండి మీరే చూడండి" అంటూ దయాకర్ జేబులోంచి ఓ ఉత్తరం తీసి అరుణ చేతికిచ్చాడు. వణుకుతున్న చేతులతో ఆ ఉత్తరాన్ని తీసుకున్న అరుణ ఆ ఉత్తరాన్ని చకచకా చదివేసింది. ఉత్తరాన్ని పూర్తిచేసేటప్పటికి ఆమెకళ్ళు బైర్లుకమ్మాయి. కోపంతో ఊగిపోతూ "ప్రదీప్! ప్రదీప్!" అని అరుస్తూ ఆమె ప్రదీప్ టీవీ ముందు కూర్చున్న

రూం దగ్గరకెళ్ళి తనశక్తినంతా కూడదీసుకొని "ప్రదీప్! ప్రదీప్!" అని అరుస్తూ ఆ గది తలుపుల్ని బాదేసింది.

లోపల్నుంచి తలుపుల్ని తెరచి "యేమైంది? ఎందుకిట్లా గావుకేకలు పెడ్తున్నావు. ఎంతమంచి మూడ్ పాడుచేశావు. ఇప్పుడే సెహ్వాగ్ ఓ బ్రహ్మాండమైన సిక్స్ బాదాడు. దాని రీప్లే చూద్దామంటే టీవీ బద్దలయిపోయేంతగా గావు కేకలు పెత్తున్నవు - ఛీ ఛీ!" అన్నాడు ప్రదీప్.

"ఎంత బరితెగించావురా... మీ గురువుగారి కూతురుకే ప్రేమలేఖ రాస్తావా?" అంది అరుణ.

"ఓహో! నీకా విషయం తెలిసిపోయిందా? ఆయనందుకే వచ్చాడా?" అన్నాడు ప్రదీప్

"అందుకే వచ్చాడు... వచ్చి ఆయనకు క్షమాపణ చెప్పుకుందువుగానీ రా!" అంది అరుణ.

"క్షమాపణ చెప్పాలా? ఎందుకు? ప్రేమించటం నేరం కాదే! మైనే ప్యార్‌కియా అని గర్వంగా, చెప్పుకుంటానుగానీ క్షమాపణ చెప్పను." అన్నాడు ప్రదీప్. "కాస్త మెల్లగా మాట్లాడు... ఆయనిక్కడే ఉన్నాడు..." అంది అరుణ.

"ఇక్కడే ఉన్నాడా? ఎక్కడున్నాడు?" అంటూ ప్రదీప్ వాళ్ళ డ్రాయింగ్ రూంలోకొచ్చాడు.

"నమస్కారం సార్! మీ రెప్పుడొచ్చారు? రమ్మని కబురుచేస్తే నేనే వచ్చేవాడినికదా... మీరిలా మా ఇంటికొచ్చి నన్ను అవమానించడం యేమి బాగాలేదు సార్!" అన్నాడు ప్రదీప్.

"నిన్ను నేను అవమానించానా? నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుస్తోందా?" అన్నాడు దయాకర్.

"తెలుస్తోంది సార్! అంత తెలియకుండా నేనేం మాట్లాడటంలేదు... టీచరింటికి స్టూడెంట్ రావాలిగానీ స్టూడెంట్ ఇంటికి టీచర్ రావడమేమిటి? ఆ స్టూడెంట్ కెంత ఇన్‌సెల్ట్! ఆ స్టూడెంట్‌కు ఆ టీచర అంటే యేమాత్రం కూడా గౌరవం లేదనేకదా మీరు ప్రచారం చెయ్యదల్చుకున్నది".

"ఓహో! నువ్విట్లా వచ్చావా నాయనా! నువ్వు నన్ను ఇన్‌సెల్ట్ చేశావో లేక నేను నిన్ను ఇన్‌సెల్ట్ చేశానో తెల్చుకుందామనే ఇలా వచ్చాన్రా బాబూ!" అన్నాడు దయాకర్.

"అదిసరేగానీ... యేమిట్రా ఇది? ఈ లెటర్ నువ్వే రాశావా?" అంటూ అరుణ ఆమె చేతిలో ఉన్న ఉత్తరాన్ని ప్రదీప్‌కు చూపించింది.

"అదా? యేమిటది? అదేమిటో నాకేం తెలుసు?" అన్నాడు ప్రదీప్ కొంచెం తటపటాయిస్తూ.

"నువ్వు దయాకర్‌సార్ వాళ్ళ అమ్మాయికి ప్రేమలేఖరాశావా? ఎంత సాహసంరా నీకు?" అంది అరుణ.

"ఓహో! నీ చేతిలో ఉన్నది నేను శ్రావ్యకు రాసిన ప్రేమలేఖా?" అన్నాడు ప్రదీప్.

"నిజం చెప్పు... ఈ ప్రేమలేఖ... ఇంత అసహ్యంగా నువ్వే రాశావా? ఇంకెవరైనా నీపేరుమీద...." అంది అరుణ.

"నేనే రాశాను. నేను శ్రావ్యను ఎంత గాఢంగా ప్రేమించానంటే.. "చిత్రం... ది పిక్చర్" సినిమాలో ఉదయ్‌కిరణ్ తనూరాయ్‌ని ప్రేమించినంత గాఢంగా... "నువ్వేకావాలి" సినిమాలో తరుణ్ రిచాను ప్రేమించినంత గాఢంగా ప్రేమించాను.." అన్నాడు ప్రదీప్.

"ఛీ! అలా మాట్లాడానికి నీకెన్ని గుండెలురా! నాకడుపున చెడబుట్టావురా" అంది అరుణ.

"ప్రేమించటానికి గుండెలు కావాలమ్మా! పిరికివాడు ప్రేమించలేడమ్మా! మైనే ప్యార్‌కియా అనీ, ప్యార్‌కియాతో డర్నా క్యాం? అని ధైర్యంగా చెప్పగల్గేవాడే ప్రేమించగలడు" అన్నాడు ప్రదీప్.

"నీకు నిజంగా పిచ్చెక్కిందిరా.... నువ్వు మీ సార్‌కు క్షమాపణ చెప్పి మరోసారి ఇలాంటి పనిచెయ్యనని చెబుతావా? లేదా?"

"చెప్పను... శ్రావ్య నా ప్రాణమమ్మా... శ్రావ్య లేకుండా ఒక్క క్షణం కూడా బతకలేనమ్మా..." అన్నాడు ప్రదీప్ పారవశ్యంలోకి వెళ్ళిపోతూ

"సినిమాలు చూసీచూసీ నువ్వు పూర్తిగా చెడిపోయావురా... శ్రావ్య లేకపోయినా బతకలేవు... క్రికెట్ చూడకపోయినా బతకలేవు.. ఫ్రెండ్స్‌తో మోటారు సైకిల్ మీద తిరక్కుండా బతకలేవు...

"ఔనమ్మా... సినిమాలే చూడకపోతే ఐశ్వర్యరాయ్ కంటె వందరెట్లు అందమైన శ్రావ్యను ప్రేమించగల్గేవాడినా? సినిమాలే చూడకపోతే నేను ప్రేమించిన అమ్మాయికి వెంటనే "ఐలవ్‌యూ" అని చెప్పేస్తూ ప్రేమలేఖ రాయగల్గేవాడినా? నేనివ్వాళ్ళ ఇంతగా ఎదిగిపోయానంటే అది నేను చూసిన సినిమాల మహాత్మ్యమేనమ్మా!" అన్నాడు ప్రదీప్.

"నీ మొఖంలేరా... వెకటికి నీలాంటి ఓ పిచ్చివాడే పిచ్చికుదిరింది... రోకలి తలకు చట్టుఅన్నాట్ట..." అంది అరుణ.

"ప్రేమా, పిచ్చీ రెండు ఒకటే అమ్మా! నీకీ మాత్రం తెలియదా? నీకెలా తెలుస్తుందిలే... నువ్వెప్పుడైనా ప్రేమలో పడ్తేకదా..." అన్నాడు ప్రదీప్.

"పిచ్చిగా వాగకు... తొమ్మిదో తరగతి చదివే పసిపిల్లను ప్రేమించడ మేమిట్రా? పట్టుమని నీకు పదియేడేళ్ళు లేవు... ఆ అమ్మాయికి 16 యేళ్ళు కూడా లేవు... అప్పుడే ప్రేమా, దోమా అంటూ అవాకులు, చెవాకులు కూస్తున్నావు!" అంది అరుణ.

"కూస్తున్నానని ఎంత బాగా అన్నావమ్మా... ప్రేమలో పడ్డవాడు కోకిలలా కూస్తాడు. సోనూనిగమ్‌లా పాడ్తాడు. మైకేల్ జాక్సన్‌లా ఆడ్తాడు. నాకు పట్టుమని పదిహేడేళ్ళు లేవన్నావు. ప్రేమకు వయస్సుతో సంబంధంలేదు. ప్రేమకు డబ్బుతో సంబంధంలేదు. మేడలు, మిద్దెలతో సంబంధంలేదు. మనం ప్రేమిస్తున్న అమ్మాయి మన టీచర్ కూతురేనన్న దాంతో కూడా సంబంధం లేదు ప్రేమ వీటన్నింటికీ అతీతమైందమ్మా! మేఘం గర్జించటం ఎంత సహజమో, చెట్టు పచ్చగా ఉండటం ఎంత సహజమో, టీచర్లు, విద్యార్థుల్ని తిట్టటం, కొట్టటం ఎంత సహజమో మేం ప్రేమించటం కూడా అంతే సహజమమ్మా" అన్నాడు ప్రదీప్.

"వరేయ్ ప్రదీప్! ఇంతసేపు నీ పిచ్చికూతలు వింటూ నేను మౌనంగా ఉండిపోయాను. మీ అమ్మ మాట వింటావేమోనని ఓపికపట్టాను. కానీ నువ్వామె మాట వినేలాలేవు... కాబట్టి నేను చెబుతున్నాను విను... నువ్వు మరోసారి మా అమ్మాయి జోలికొచ్చావంటే నీ చర్మం వొలిచేస్తాను. నిన్ను ప్రపంచంలోనే లేకుండా చేస్తాను. ఈ బక్క బడిపంతులేం చేస్తాడనుకుంటున్నావేమో! మా జోలికొచ్చావంటే మేమేమిటో చూపిస్తాం... జాగ్రత్త..." దిగ్గునలేచి దయాకర్ ఆవేశంతో ఊగిపోతూ అన్నాడు.

"జాగ్రత్తగానే ఉంటానుసార్... మీరు బక్క బడిపంతుళ్ళెందుకవుతారు. మీ టీచర్సంటే సామాన్యులా సార్?... మా విద్యార్థులకెంతో ఆదర్శంగా ఉండాల్సిన మీ టీచర్లు యేం చేస్తున్నారో... ఎలా ఉంటున్నారో మాకు తెలీదా సార్! మా విద్యార్థులచేత ఎన్ని పనులు చేయించుకుంటారో... అయినదానికీ, కానీదానికి మమ్మల్నెంత కఠినంగా శిక్షిస్తారో మాకు తెలీదాసార్... క్లాసులు వదిలిపెట్టేసి మీరెన్నిసార్లు స్టాఫ్ రూముల్లో పేకాడుతూ కూర్చొవడం మే చూడలేదనుకుంటున్నారా సార్! మీరెన్నిసార్లు స్కూళ్ళో పార్టీలు చేసుకుంటూ ఎన్‌జాయ్ చేశారో మాకు తేలీదా సార్! ఇదేమిటని అడిగినందుకు మీరందరూ కలిసి... పాపం ధర్మరాజులాంటి హెడ్‌మాస్టర్‌ను ముప్పుతిప్పలు పెట్టి ట్రాన్స్‌ఫర్ చేయించలేదాసార్! బాగా చదివే విద్యార్థుల ముందు బాగా చదవని

విద్యార్థుల్ని మీరు తిట్టిన తిట్టు తిట్టకుండా తిడ్తే మొన్న మన స్కూళ్ళో ఓ విద్యార్థి పురుగుల మందు తాగి చావలేదా సార్! మొన్ననే మన స్కూళ్ళో పనిచేస్తున్న ఓ పెళ్ళయిన టీచర్ మన స్కూళ్ళోనే పనిచేస్తున్న ఓ పెళ్ళికాని టీచరమ్మను ప్రేమించానని వెంటపడ్తే ఆ టీచరమ్మ పోలీసు కంప్లెయింటివ్వలేదా సార్! యథారాజా... తథా ప్రజ అని మీరే ఒకసారి చెప్పలేదా... యథా ఉపాధ్యాయ... తథా విద్యార్థి అని నేనంటున్నాను" అన్నాడు ప్రదీప్.

ప్రదీప్ నోటి నుండి ప్రవాహంలా వెలువడిన ఆ మాటలు వినేటప్పటికి దయాకర్‌కు ముచ్చెమటలు పట్టాయి. ఇవాళ్టి విద్యార్థులు చాలా తెలివిమీరి పోయారు. వాళ్ళ జోలికి వెళ్ళేటట్టులేదు... అనుకున్నాడు.

"మా టీచర్లలో యేకొద్దిమందో అలాంటివాళ్ళు ఉంటే ఉండొచ్చు. అలా అని నువ్వు చేసిన తప్పును కప్పిపుచ్చుకోలేవు. నేనెప్పుడైనా క్లాసులు ఎగ్గొట్టి పేకాడటం చూశావా? పిల్లల్ని దూషించటంగానీ, కొట్టడంగానీ నేనెప్పుడైనా చేశానా? నిజం చెప్పు..." అన్నాడు దయాకర్.

"లేదుసార్... మీలాంటి మంచిటీచర్లుండబట్టే మన స్కూల్స్ ఈ మాత్రమైనా నేర్చుకుంటున్నారు" అన్నాడు ప్రదీప్.

"యేం నేర్చుకుంటున్నరు... నా బొంద. నువ్వో మంచి విద్యార్థివనుకొని నిన్నెంతో ప్రోత్సహించాను. కానీ నువ్వేం చేశావు. ముక్కుపచ్చలారని మా అమ్మాయిని ప్రేమించానని వెంటబడ్డావు. అసలు నీకు ప్రేమంటే యేమిటో తెలుసా? ప్రేమకూ ఆకర్షణకూ తేడా తెలుసా?" అన్నాడు దయాకర్.

"అన్నీ తెలుసుసార్... మేరేమీ అనుకోనంటే మీకో నిజం చెబుతాను" అన్నాడు ప్రదీప్

"యేమిటానిజం?" అన్నాడు దయాకర్.

"నిజంగా నిజం చెబుతానుసార్. మీరేమీ అనుకోవద్దు".

"అనుకోవడం అనుకోకపోవడం తర్వాత - యేమిటో త్వరగా చెప్పు"

"చెప్పేస్తున్నాను సార్... మీ అమ్మాయి కూడా నన్ను ప్రేమించింది. నిజంగా ప్రేమించింది. యేదో టీ.వీ. సీరియల్లో ఓ చిన్నమ్మాయే ఓ అబ్బాయిని ప్రేమించేసింది. మనమూ అలాగే ప్రేమించుకుందామని నాతో అందిసార్... నువ్వు అచ్చం ఉదయ్‌కిరణ్‌లాగే ఉంటావు. నిన్ను నేను ప్రేమించకుండా ఉండలేకపోతున్నాను దీపూ! అందిసార్. నాకు తను కూడా ఓ ప్రేమలేఖ రాసింది సార్. ఈ మధ్యనే వచ్చిన ఓ సినిమాలో హీరో హీరోయిన్లు ఒకర్నొకరు చూసుకోకుండానే ప్రేమలేఖలు రాసుకొని

ప్రేమించుకుంటారు. అలా మనం కూడా ప్రేమలేఖలు రాసుకొని ప్రేమించేసుకుందాంరా! అని నాకీ ప్రేమలేఖ రాసిందిసార్... ఇది నా జేబులోనే ఉంది. కావాలంటే మీరూ చూడండి" అంటూ ప్రదీప్ జేబులోంచి ఓ ఉత్తరం తీసి దయాకర్ చేతికిచ్చాడు.

దయాకర్ ఆ ఉత్తరాన్ని చకచకా చదివేసి "అవును... ఇది మా అమ్మాయి రాసిందే... ఆమె హ్యాండ్‌రైటింగ్‌ను నేను గుర్తుపట్టగలను...

ఎంతపని చేశావే శ్రావ్యా! నువ్విన్ని సినిమాలు చూశావనీ, ఇన్ని టీవీ సిరియల్స్ చూశావని కలలోకూడా అనుకోలేదు. ఎప్పుడు చూసినా ఎంతో బుద్ధిమంతురాలిలా చదువుకుంటూ కనిపించేదానివి ఎంతో అమాయకురాలివి అనుకున్నాను... ఇలా ప్రేమలేఖ రాసేంత సాహసం చేస్తావని ఊహించలేకపోయాను" అలా అంటూనే దయాకర్ ఎలక్ట్రిక్‌షాక్ తిన్నవాడిలా కుర్చీలో కూలబడిపోయాడు.

ఈలోగా బయట్నించి ప్రదీప్‌వాళ్ళ నాన్న రామకృష్ణ ఇంట్లోకొచ్చాడు. అతని చేతిలో ఓ పాకెట్ ఉంది. అతడు వంకర టింకరగా నడుస్తూ ఇంట్లోకి రావడం చూస్తే అతడు తాగి వచ్చాడనిపించింది. డ్రాయింగ్ రూంలో కూర్చున్న దయాకర్‌ను చూడగానే కొంచెం ఆశ్చర్యంతో "హలో దయాకర్‌గారూ! మీరెప్పుడొచ్చారు? మీరు రావడంతో మా ఇల్లు పావనమైపోయింది సార్!" అన్నాడు రామకృష్ణ దయాకర్‌కు నమస్కారం చేస్తూ.

"నేనొచ్చి గంటయ్యింది రామకృష్ణగారూ! మీతో మాట్లాడదామనే వచ్చాను. మీరు బయటకు వెళ్ళారని తెలిసింది. మా ప్రియమైన విద్యార్థి, మీ ముద్దుల కొడుకు ప్రదీప్‌కుమార్‌ను చూసిపోదామని వచ్చాను" అన్నాడు దయాకర్.

"ఈ జోక్ బావుందండి దయాకర్‌గారూ! శిష్యున్ని చూడటానికి గురువుగారు రావడమేమిటి? ఎం.ఎల్.ఏ ఇంటికి ముఖ్యమంత్రిగారొచ్చినట్టుంది" అంటూనే రామకృష్ణ ఫెళ్ళున నవ్వాడు.

"యేంచేస్తామండీ, మొహ్మద్ దగ్గరకు మౌంటెన్ రాకపోతే మౌంటెన్ దగ్గరకే మొహ్మద్ వెళ్ళక తప్పదుగా" అన్నాడు దయాకర్.

"బావుందండీ! ఈ జోక్ చాలా బావుంది. మొహ్మద్... మౌంటెన్... మౌంటెన్... మొహ్మద్... ఈ జోక్ ఇదివరకే ఎక్కడో విన్నట్టుంది. మీరు మా ఇంటి కొచ్చినందుకు మెనీ మెనీ థాంక్స్... మీకు స్వాగతం సుస్వాగతం... సుస్వాగతం... మీకు మా ఆవిడ కనీసం ఓ కప్పు టీ అయినా ఇచ్చిందా లేదా? అయినా ఈ చల్లని సాయంకాలం... ఇప్పుడే సన్నగా ముసురుకూడా కురుస్తోంది. ఇలాంటి వాతావరణంలో రెండు పెగ్గులు రమ్మో, బ్రాండీయో వేసుకుంటే ఎంత బావుటుందో...

మీరు తీసుకుంటారా దయాకర్ గారూ.. మీరు రాక రాక మా ఇంటికొచ్చారు. మీకీ మాత్రం సన్మానం చెయ్యకపోతే ఎలా? లోపలికెళ్ళి రమ్ము కొడదాం రండి. యేమే అరుణా, ఈ పాకెట్‌ను లోపల పెట్టేసి రెండు గ్లాసులు రెడీ చెయ్యి" అంటూ రామకృష్ణ తన చేతిలో ఉన్న ఓ పాకెట్‌ను అరుణకిచ్చాడు.

"అయ్యా! రామకృష్ణగారు... నాకు రమ్ములూ బ్రాండీలు వద్దు... నేను మీతో ఓ విషయం మాట్లాడటానికొచ్చాను. కానీ ఈ స్థితిలో ఉన్న మీతో యేం మాట్లడను?" అన్నాడు దయాకర్.

"వస్తున్నా... వస్తున్నా... మీ దగ్గరికే వస్తున్నా మనం హాయిగా రమ్ము కొడ్తూ మాట్లాడుకుంటే ఎంత బావుంటుందో.... ఆ అరేంజ్‌మెంట్ చేస్తున్న" అన్నాడు రామకృష్ణ. "యే అరేంజ్‌మెంట్ అక్కర్లేదు. నేను రేపు మళ్ళీవస్తాను" అంటూ దయాకర్ బయటకు వెళ్ళిపోయాడు.

"ఇంతకూ ఈ పాకెట్ యేమిటి? దీంట్లో యేముంది?" అంది అరుణ.

"ఈరోజు నాకు ఆఫీసులో అనుకోకుండా ఒకతడు ఓ గిఫ్ట్ తెచ్చిచ్చాడు. అతనికి నేనో పనిచేసిపెట్టాలే... అది డీ.వీ.డి ప్లేయరేలే... గిఫ్ట్‌తోపాటు అతడో స్టార్ హోటళ్ళో నాకు మంచి పార్టీకూడా ఇచ్చాడు..." అన్నాడు రామకృష్ణ.

"డీ.వీ.డి. ప్లేయర్ మనిట్లో ఉందికదా... మళ్ళీ ఇదెందుకు?" అంది అరుణ.

"ఇది లేటెస్ట్ మోడల్ అట... అన్ని రకాల డీవీడీలను దీంట్లో వేసుకొని చూడొచ్చునట..." అన్నాడు రామకృష్ణ.

"థాంక్యూ డాడీ.... థాంక్యూ వెరీమఛ్... దీన్ని నాకే ఇవ్వండి... మైకేల్ జాక్సన్ డీవిడీ మొన్ననే తెచ్చాను... అది వేసుకొని చూస్తాను" అన్నాడు ప్రదీప్.

"బేసిక్ ఇన్‌స్టింక్ట్" అని అప్పుడెప్పుడో ఓ సినిమా చూశారా? అదిప్పుడు డీవీడీగా దొరుకుతోందట... దాన్ని పట్టుకొస్తావా? ఆ సినిమాను మరోసారి చూడాలని ఉందిరా" అన్నాడు రామకృష్ణ.

"తప్పకుండా డాడీ! ఇప్పుడు తెమ్మంటే ఇప్పుడే వెళ్ళి తెస్తాను..." అన్నాడు ప్రదీప్.

"ఛీఛీ! సమాజం ఎంతగా దిగజారిపోయిందో మిమ్మల్ని చూస్తే అర్థమవుతోంది. తండ్రీ కొడుకులు కలిసి ఆ బూతు సినిమా చూస్తారా?" అంది అరుణ.

"బూతు సినిమా అని నీకెలా తెలిసింది? అంటే నువ్వూ ఆ బూతు సినిమా చూశావన్నమాట".

"నేనా సినిమా చూళ్ళేదు. నేనస్సలు సినిమాలే చూడను... మీరే ఓసారి చెప్పగా విన్నానంతే" అంది అరుణ.

"ఓ.కె. ఓ.కె. ఎవరో చెప్పగా విన్నావు... తండ్రీ కొడుకులు కలిసి ఆ బూతు సినిమా చూస్తారా అన్నావు. చూస్తేయేం? తండ్రీ కొడుకులంటే ఎవరు? నా దృష్టిలో తండ్రీ కొడుకంటే జస్ట్ ఫ్రెండ్స్... వాళ్ళు ఫ్రెండ్స్‌లా ఉండాలని అందరూ చెబుతున్నారు. తండ్రంటే పూర్వంలా ఎప్పుడూ కొడుకును దండించే వాడిలా ఉండకూడదని కొడుకంటే అదండనకు గురయ్యే వాడిలా ఉండకూడదని ఇవ్వాళ్ళ అందరూ చెబుతున్నారు కదా? విలువలు విలువలు అంటున్నావు. బూజుపట్టిన పాత విలువలు. వాటికి కాలం చెల్లిపోయింది మైడియర్ వైఫ్!" అన్నాడు రామకృష్ణ.

"ఇంతకూ డీ.వీ.డి. ప్లేయర్ మీద ఎంత తగిలేశారు?" అంది అరుణ.

"అది గిఫ్ట్‌గా వచ్చిందంటే నమ్మడంలేదా?" అన్నాడు రామకృష్ణ.

"మీరు చెప్పేవన్నీ కథలని నాకు తెలుసు... మీకెవడూ దాన్ని గిఫ్ట్‌గా ఇవ్వలేదు... మీరే కొనుక్కొచ్చారు! ఎంత తగిలేశారో చెప్పండి" అంది అరుణ.

"ఎంతోకాదులేవే... అదీ ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో... ఒక్కపైసా ఇవ్వకుండానే ఇవ్వాళ్ళ మనం యేదంటే అది కొనుక్కోవచ్చు... నా ఫ్రెండొకడు హ్యుండాయ్ కార్ల షోరూం ఓపెన్ చేశాడు. ఓ కారు తీసుకొమ్మని రోజూ ఫోన్‌చేస్తున్నాడు. తనే ఫైనాన్స్ అరేంజ్ చేస్తానంటున్నాడు. ఓ సాంట్రో కారుకొనేద్దామనుకుంటున్నాను. ఆ కార్లో నిన్ను నా పక్కన కూర్చోబెట్టుకొని గాల్లో తేలిపోయినట్టుగా తేలిపోతుంటే ఎంత హాయిగా ఉంటుందో ఊహించుకో... ఒక్క పైసా ఖర్చు పెట్టకుండానే ఇంత ఆనందం లభించటం అంటే ఎంత అద్భుతమో... రియల్లీ ఫెంటాస్టిక్... ఒకప్పుడు కారుకాదు ఒక స్కూటర్ కొనుక్కోవడమంటేనే గగనకుసుమంలా ఉండేది. ఒక టెలిఫోన్ పెట్టించు కోవాలంటే ఓ పదిసంవత్సరాలు వెయిట్ చెయ్యాల్సివచ్చేది. ఇప్పుడు క్షణాల్లో యేదంటే అది... అదీ వడ్డీలేని అప్పుల్తో కొనుకోవచ్చు. ఇదంతా కొత్తగా వచ్చిన ఎల్.పీ.జీ. ప్రభావమే" అన్నాడు రామకృష్ణ.

"ఎల్.పీ.జీ యేమిటి? గ్యాసా?" అంది అరుణ.

"గ్యాసుకాదే ఎడ్డిమొఖమా! ఎల్.పీ.జి. అంటే లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్. గ్లోబలైజేషన్ - లిబరలైజేషన్ అంటే సరళీకరణ - ఇదివరకు అన్నీ ప్రభుత్వమే సప్లై చేసేది. అన్నింటిమీద కంట్రోళ్ళుండేవి విదేశవస్తువుల్ని అనుమతించేవాళ్ళుకాదు. అప్పుడవన్నీ పోయాయి - దీన్నే సరళీకరణ అన్నారు. అలాగే ఇదివరకు వెల వెల కోట్లు ఖర్చుచేసి పరిశ్రమలనన్నింటినీ ప్రభుత్వరంగంలో స్థాపించేవాళ్ళు. అవన్నీ దివాళా తీసాయి. వాటినన్నింటినీ ప్రైవేట్ వాళ్ళకిచ్చేస్తున్నారు. కొత్తగా వచ్చే పరిశ్రమలన్నీ ప్రైవేట్ రంగంలోనే... దీని ప్రైవేటైజేషన్ అంటున్నారు. గ్లోబలైజేషనంటే

ప్రపంచీకరణ. ప్రపంచమంతా ఇప్పుడు ఒకటే మార్కెట్ – ఎక్కడ తయారైన వస్తువులైనా మరో దేశంలోకి ఫ్రీగా రావొచ్చు. అమెరికాలో, జపాన్‌లో తయారైన కార్లు మనదేశంలో కొచ్చేస్తున్నాయి... వాటిని మనం ఇంటరెస్ట్ ఫ్రీ లోన్స్‌తో కొనుకోవచ్చు".

"డాడీ! డాడీ! రేపు మీరు నిజంగానే సాంట్రో కారు కొంటున్నరా? నిజంగా కొంటున్నరా?" అన్నాడు ప్రదీప్.

"నిజం మైడియర్ సన్... నిజంగా నిజం. హండ్రెడ్ పర్సెంట్ నిజం. కాళ్ళు కడిగి కన్యాదానం చేసినట్టుగా హ్యుండాయ్ కంపెనీ వాడు నా కాళ్ళు కడిగి నాకు సాంట్రోకారు దానం చేస్తానంటున్నాడు. మనకు కారిస్తాననని అతడంత ముచ్చపడ్తోంటే మనం తీసుకోకపోతే యేం బావుంటుంది చెప్పు" అన్నాడు రామకృష్ణ.

"అయితే నేనిప్పుడే వెళ్ళి డ్రైవింగ్ నేర్చుకుంటాను" అన్నాడు ప్రదీప్.

"మన అందానికి కారొక్కటే తక్కువుంది. ఇదివరకు ఏ.సీ కోసం. ఫ్రిడ్జ్‌కోసం, ఎల్‌సీడి టీవీ కోసం చేసిన అప్పులే తీరలేదు. ప్రతినెలా ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టేటప్పటికి తల ప్రాణం తోకకొస్తోంది. తినిడానికి తిండిలేధు మీసాలకు సెంట్ అన్నట్టు సాంట్రోకారు కొంటారా? మీరలాంటి పనిచేస్తే నేను యే బావిలోనన్న దూకిచస్తాను". అంది అరుణ.

"యే ఆడదైనా తన భర్త కారు కొంటున్నాడంటే చాలా సంతోషిస్తుంది కదే... నువ్వేమిటే చస్తానంటున్నావు... నీకేమన్నా పిచ్చా?" అన్నాడు రామకృష్ణ.

"పిచ్చే.... మూడు నెలలుగా ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టలేదని టీవీవాడు మనుషుల్ని పంపిస్తున్నాడు. యే క్షణంలోనైనా వాళ్ళు మనింట్లో ఉన్న టీ.వీ. ఫ్రిడ్జ్ అన్నీ పట్టుకు పోవచ్చు... అదే జరిగితే నల్గురూ నవ్వుతారు... నీ కొడుకేమొ ముక్కుపచ్చలారని పసిపిల్లలకు ప్రేమలేఖలు రాస్తున్నాడు. ఆ అమ్మాయి తల్లిదండ్రులు పోలీసు కంప్లెయింటిచ్చి వాడిని జైళ్ళో పెట్టేటట్టున్నారు. మీరేమొ అప్పులు చేస్తూ తాగి తందనాలాడ్తూ సాంట్రోకారు కొంటానంటున్నారు" అంది అరుణ.

"నా కొడుకును జైళ్ళో పెట్టించే వాడెవడూ ఈ భూమ్మీద పుట్టలేదే... వయసు మీదున్నాడు కాబట్టి ఓ ప్రేమలేఖ రాస్తే రాశాడేమొ... అదో పెద్ద తప్పా? దానికే వాన్ని అరెస్ట్ చేసి జైళ్ళో పెడ్తే ఊరుకుంటాననుకుంటున్నావా? ఈ ఊర్లో ఉన్న పోలీసులంతా నాకు ఫ్రెండ్సే..." అన్నాడు రామకృష్ణ.

"థాంక్యూ డాడీ... థాంక్యూ... మమ్మీ అలాగే అంటుంది. మీరు వెంటనే కారు కొనెయ్యండి డాడీ!" అన్నాడు ప్రదీప్.

"కొంటారా... తప్పకుండా కొంటాను.. మొన్న నేనో పెద్ద కాంట్రాక్టర్‌కు బిల్లు సాంక్షన్ చేయించాను. అతడు మనకు కనీసం ఓ రెండులక్షలన్నా ఇస్తాడు..." అన్నాడు రామకృష్ణ.

"లంచాలు తీసుకుంటున్నారని ఇదివరకే ఒకసారి మిమ్మల్ని సస్పెండ్ చేశారు. మళ్ళీ లంచాలు తీసుకోవడం మొదలెట్టారా? మిమ్మల్నిక ఆ భగవంతుడు కూడా కాపాడలేదు" అంది అరుణ.

"పిచ్చి మొఖమా? నేను తీసుకుంటున్నది లంచాలు కాదే... లాంఛనాలు... లాంఛనాలన్నది మన సంప్రదాయంలో ఎప్పట్నించో ఉన్నదే... ఎవరికన్న యేదన్న సహాయం చేస్తే కృతజ్ఞతా పూర్వకంగా తృణమొ ఫలమొ సమర్పించుకోవడం మామూలేగా... దేవుడికో మొక్కు మొక్కుకుంటాం... మనకు దేవుడా పని చేసి పెట్టాడనుకో... మనం వెంటనే మొక్కు చెల్లించుకోవడం లేదూ? తిరుపతి దేవునికి వేలకోట్లు జనం ఎందికిస్తున్నారు. అదంతా లంచం కాదా? లంచాలు దేవుడికివ్వగా లేనిది మనుష్యులకిస్తే తప్పా" అన్నాడు రామకృష్ణ.

"మీ వితండవాదం నాకు తెలిసిందే... మీ తండ్రీకొడుకుల మధ్య ఈ ఇంట్లో నేనిక ఒక్క క్షణం కూడా ఉండను...వెళ్ళి పోతాను... యే నుయ్యో గొయ్యో చూసుకుంటాను" అంది అరుణ కళ్ళనీళ్ళు తీసుకుంటూ.

"ప్రతి ఆడది ఇలాగే మాటమాటకు చస్తాననే బెదిరిస్తుంది... నీ బెదిరింపులకు బెదిరేవాళ్ళిక్కడెవరూ లేరు." అన్నాడు రామకృష్ణ.

"మిమ్మల్నెవరూ బెదిరించటంలేదు. నా మానాన నేను వెళ్ళిపోతానంటు న్నాను. ఇప్పుడే ఈ క్షణమే నేనీ ఇంట్లోంచి వెళ్ళిపోతున్నాను. ఈ నీతి తప్పిన మనుష్యుల మధ్య నేనిక ఉండలేను" అంది అరుణ.

"ఉండకేంచేస్తావే... కుక్కిన పేనులా ఉంటావు!" అన్నాడు రామకృష్ణ.

"ఉండను... ఇంతకాలం ఈ ఇంట్లో కుక్కిన పేనులానే పడున్నాను. కానీ ఇక ఉండను... వెళ్ళిపోతున్నాను" అంటూనే అరుణ ఇంట్లోకెళ్ళి సూట్‌కేసు సర్దుకోసాగింది.

"ఎక్కడికెళ్తావు... మీ తల్లిగారింటికా... వాళ్ళకేగతి లేదు. నీకేం పెడ్తారు. పస్తులుండి చస్తావు? అన్నాడు రామకృష్ణ". చస్తే చస్తానుగానీ మీ మధ్య మాత్రం ఉండను. కొడుకేమొ దేవుడులాంటి గురువుగారి కూతురికి ప్రేమలేఖ రాస్తాడు. ఆ గురువుగారు ఇంటికొస్తే కనీసం పశ్చాత్తాపం కూడా ప్రకటించడు. తండ్రేమొ అద్దమైన

గడ్డితింటూ తాగితందనాలాడుతున్నాడు. ఛీ ఛీ!" అంటూనే అరుణ సూటుకేసు సర్దుకొని బయటకెళ్ళటానికి సిద్ధమైంది.

"మమ్మీ! మమ్మీ! నువ్వు నిజంగా వెళ్ళిపోతున్నావా? లేక జోక్ చేస్తున్నావా?" అన్నాడు ప్రదీప్.

"జోక్ చెయ్యడంలేదురా... నిజంగానే వెళ్తున్నాను" అంది అరుణ.

"నువ్వు వెళ్ళిపోతే నాకు అన్నమెవరు వండిపెడ్తారు. నువ్వు వెళ్ళటానికి వీల్లేదమ్మా" అన్నాడు ప్రదీప్.

"మీ నాన్నే నీకు అన్నం, కూర అన్నీ వండిపెడ్తారు." అంది అరుణ. "దాన్ని వెళ్ళనీయ్‌రా ప్రదీప్...మనం హోటల్‌కెళ్ళి తిందాం... ఎన్ని రోజులు వెళ్తుంది... రేపీ టైమ్‌కు అదే మళ్ళీ తిరిగొస్తుంది..." అన్నాడు రామకృష్ణ.

"నన్ను నిజంగా మంచి చికెన్ బిర్యానీ దొరికే హోటల్‌కు తీసికెళ్తావా డాడీ! అయితే ఓ.కె! అమ్మెప్పుడు బిర్యానీ చెయ్యమన్న చెయ్యదు..." అన్నాడు ప్రదీప్.

ఆ క్షణమే అరుణ ఆ ఇంట్లోంచి బయటకు వెళ్ళిపోయింది.

* * * *

– 'జయంతి' త్రైమాసిక